ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి – ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 197 ఆదివారం 05 - 07 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 197 Sunday 05 - 07 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే అప్పుల రాష్ట్రంగా మార్చారు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 20 ఏళ్ల ప్రజాప్రతినిధి ప్రస్థానానికి కృతజ్ఞత సభ
- పేదల మధ్య పెరిగిన నాకు ప్రజల సమస్యలు బాగా తెలుసు
- కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వ పనితీరును వివరించిన రేవంత్
- బీఆర్ఎస్‌కు గతం మాత్రమే ఉంది.. భవిష్యత్ లేదు



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 04 :** దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చుని.. పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా? అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తట్ట పనికి, మట్టి పనికి మనమే కావాలి.. కానీ, పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి, విత్తనానికి మధ్య బంధం ఎలా ఉంటుందో.. పేదవాడికి, పాలన చేసేవాడికి మధ్య అదే బంధం ఉంటుందని పేర్కొన్నారు. అహంకారులకు బుద్ధి చెప్పాలా? వద్దా? అని ప్రశ్నించారు. గద్దర్ అన్నను గడీ ముందు నిలబెట్టినవారికి ఉరిశిక్ష వేసినా తక్కువే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మిడ్జిల్‌లో శనివారం కృతజ్ఞత సభ జరిగింది. సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబంలో వారికే పదవులు వచ్చాయి. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టండి. రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? ఉచిత కరెంట్ ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించినందుకు ప్రజాపాలన పోవాలా?.. - మిగతా 2 లో

### కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై
## బండి సంజయ్ ఫైర్



- తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది
- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 04 :** తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. - మిగతా 2 లో




### ఈసీపై ఘాటుగా
## స్పందించిన కవిత

- పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం
- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 04 :** సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు - మిగతా 2 లో

### తీవ్ర వేడికి భగభగమంటున్న అమెరికా
### 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రద్దు!



2 లో

- 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారీ వేడుకలకు సిద్ధమైన అమెరికా
- విపరీతమైన వేడి కారణంగా వేడుకలు రద్దు
- తీవ్రంగా ప్రభావితమవుతున్న విద్యుత్ వ్యవస్థ

### తెలంగాణలో పోలీస్
## కొలువుల జాతర


- 7 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం
- హోంశాఖ పరిధిలోని పోలీస్, జైళ్లు, ఫైర్, ఎస్‌పీఎఫ్ విభాగాల్లో నియామకాలు
- ఇప్పటికే 5 వేల పోస్టులకు జీవోలు జారీ.. మరో 2 వేలకు త్వరలో ఉత్తర్వులు
- ఆర్థిక శాఖ అనుమతులు రావడంతో నోటిఫికేషన్‌కు సిద్ధమైన టీఎస్ఎల్‌పీఆర్‌బీ
- రాష్ట్రం ఏర్పడ్డాక ఇది నాలుగో అతిపెద్ద పోలీస్ క్రూట్‌మెంట్




2 లో

## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ
- జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ
- మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం
- తీవ్ర నేరాల్లో జైలుకెళ్తే పదవులు రద్దు చేసే బిల్లును ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం



**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 04 :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ - మిగతా 2 లో

## దేశ ప్రజలపై భారం పడకుండా చూశాం



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం
- రాజస్థాన్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ ప్రారంభం
- రూ.1.06 లక్షల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- సంక్షోభ సమయంలో 40కి పైగా దేశాల నుంచి ఇంధన దిగుమతులు
- ప్రజలపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ సుంకం తగ్గింపు

**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 04 :** చురుకైన విధానాలు, విభిన్న ఇంధన వనరులు, బలమైన దౌత్య సంబంధాల ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాల్లో ఒకదానిని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. సరైన సమయంలో తీసుకున్న నిర్ణయాలతో దేశ ప్రజలపై కనీస భారం పడేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా నవభారత్ తన సంకల్పం నుంచి వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రలో - మిగతా 2 లో



## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం

- నేటి 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో

**వార్త సంధ్య, అమరావతి, జులై 04 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ - మిగతా 2 లో

### ఆదర్శ గ్రామంగా నలగంపల్లె
### కుప్పం అంతటా 'నెట్ జీరో' మోడల్



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కుప్పంలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- 'నెట్ జీరో' విధానాన్ని పాటిస్తున్న నలగంపల్లె గ్రామంలో పర్యటన
- సౌర విద్యుత్ వినియోగంతో నెలకు రూ.400 ఆదా చేసుకుంటున్న గ్రామస్థులు
- సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించాలని, ఈవీలను చేర్చాలని సూచన

**వార్త సంధ్య, అమరావతి, జులై 04 :** సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండో రోజు పర్యటన కొనసాగించారు. ఈ పర్యటనలో భాగంగా, ఆయన నలగంపల్లె గ్రామాన్ని సందర్శించి, అక్కడి ప్రజలు అవలంబిస్తున్న వినూత్న 'నెట్ జీరో' విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. సౌర - మిగతా 2 లో

## వారసత్వ భూములపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

- ఇక ఆఫీసుల చుట్టూ తిరగనక్కర్లేదు!
- వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ విధానం అమలు
- రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు
- మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలకు చెక్
- రూ.10 లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100
- వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్ఎంసీ తప్పనిసరి




**వార్త సంధ్య, అమరావతి, జులై 04 :** ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు అనుమతించిన సర్కార్, తాజాగా మరో కీలక ముందడుగు వేసింది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.

**పాత పద్ధతికి స్వస్తి.. కొత్త విధానం ఇలా**

ఇంతకుముందు, కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే - మిగతా 2 లో

## మాల, విద్యార్థి యువకులకు, ఉద్యోగ, మేధావులకు ప్రజా ప్రతినిధులకు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 4.:** ఈనెల 5వ తేదీన జరిగే హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద మాల ధర్నాను జయప్రదం చేయాలని మాల సంఘాల రాష్ట్ర వైస్ చైర్మన్, ప్రముఖ అడ్వకేట్ తలమల్ల హసేన్ కోరారు తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల గ్రూప్ త్రీ లో ఉన్న మాల కులాల వర్గానికి నష్టం జరుగుతున్న రోస్టర్ పాయింట్ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ... ఈనెల 5వ తేదీన హైదరా బాద్ లో ఇందిరా పార్క్ వద్ద జరుగుచున్న మాలల ధర్నా పాల్గొనుటకు అన్ని జిల్లా ల నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు తెలంగాణ అన్ని జిల్లా ల నుంచి మాలలు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు

## చెఫ్ రణవీర్ బ్రార్‌తో ఫిలిప్స్ వన్‌చెఫ్ బిర్యానీ ప్రీమియర్ లీగ్ ముగింపు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 4:** హైదరాబాద్‌లోని విజయ్ సేల్స్‌లో నిర్వహించిన గ్రాండ్ ఫినాలేతో ఫిలిప్స్ డొమెస్టిక్ అప్లయన్సెస్ తయారీ సంస్థ 'వర్సుని ఇండియా' చేపట్టిన 'వన్‌చెఫ్ బిర్యానీ ప్రీమియర్ లీగ్' విజయవంతంగా ముగిసింది. భారతీయ బిర్యానీ సంప్రదాయాన్ని, దానిలోని వైవిధ్యాన్ని జరుపుకోవడానికి ఆహార ప్రియులు, కంటెంట్ క్రియేటర్లు, మీడియా మిత్రులు వంట నిపుణులు ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. ప్రముఖ సెలబ్రిటీ చెఫ్ రణవీర్ బ్రార్ ప్రముఖ తెలుగు నటి తేజస్వి మదివాడ ముఖ్య అతిథులుగా హాజరై, దేశవ్యాప్త ఓటింగ్ ద్వారా ఎంపికైన 'ఇండియాస్ ఫేవరెట్ బిర్యానీ'ని వేదికపై ప్రకటించారు. ఈ ప్రచారంలో హైదరాబాద్, అవధి, కోల్‌కతా, బాంబే, సింధీ, కశ్మీరీ, కాన్పూరీ, బెంగళూరు మరియు గోవా ఫిష్ బిర్యానీలపై వినియోగదారులు చూపిన ఉత్సాహం, వారి మధ్య ప్రాంతీయ అభిమానాన్ని మరియు ఆరోగ్యకరమైన పోటీని పెంచింది. వన్‌చెఫ్ అనే వంట పరికరం, భారతీయ వంటకాలకు అవసరమైన అన్ని పనులను ఒకే చోట సులభంగా చేయగలదని ఈ వేదిక ద్వారా తెలియజేశారు. గ్రాండ్ ఫినాలేలో నిర్వహించిన లైవ్ డెమో ద్వారా, రకరకాల ప్రాంతీయ వంటకాలను ఇంట్లోనే సులభంగా ఎలా తయారు చేసుకోవచ్చో చూపించారు. ఈ సందర్భంగా వర్సుని ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పూజా బైడ్ మాట్లాడుతూ, ఆహారంతో ప్రజలకు ఉన్న లోతైన భావోద్వేగ అనుబంధాన్ని ఈ లీగ్ వేడుకగా మార్చిందని పేర్కొన్నారు. భారతీయ వంటిళ్ల రోజువారీ వాస్తవాల నుండి స్ఫూర్తి పొందిన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, వినియోగదారులకు అర్థవంతమైన అనుభవాలను అందించాలనే తమ నిబద్ధతను వర్సుని ఇండియా కొనసాగిస్తుందని సంస్థ స్పష్టం చేసింది. హైదరాబాద్ బిర్యానీ భారతీయులకు అత్యంత ఇష్టమైన బిర్యానీగా నిలిచింది.

## అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవతో నిమ్స్ చికిత్సకు రూ.4.50 లక్షల ఎల్.ఓ.సి మంజూరు

**పేద మహిళకు అండగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.. రూ.4.50 లక్షల వైద్య సాయం**

**తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు భారీ వైద్య సహాయం**

**ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవతో నిమ్స్ చికిత్సకు ఆర్థిక భరోసా**



**చంద్రుగొండ ప్రతినిధి జూలై 04(వార్త సంధ్య) :** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మరోసారి స్పందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం వెల్లకంవారిగూడెం గ్రామానికి చెందిన వెల్లకం పార్వతమ్మ తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితిలో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు.విషయాన్ని వెంటనే పరిశీలించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 4.50 లక్షల విలువైన ఎల్.ఓ.సి (గ్రావ్‌వతీ శీట జతీవసఱ్) మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో పార్వతమ్మకు అవసరమైన చికిత్స కొనసాగేందుకు ఆర్థిక భరోసా లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పార్వతమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తూ వైద్య సహాయం అందించడంలో ఎమ్మెల్యే చొరవ అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రజలకు వైద్య సహాయం, విద్య, గృహాలు, మౌలిక సదుపాయాలు వంటి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు.

## వార్త సంధ్య కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం తొలగింపు.. కొత్త స్తంభం ఏర్పాటు

**సుజాతనగర్ విద్యుత్ అధికారుల తక్షణ చర్యపై స్థానికుల హర్షం**






**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 04 (వార్త సంధ్య):** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ నిరంతరం బాధ్య తాయుతమైన జర్నలిజానికి కట్టుబడి ఉన్న వార్త సంధ్య పత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు. ఈ నెల 4వ తేదీన సుజాతనగర్ మున్సిపాలిటీ పరిధిలోని వేపలగడ్డ 23వ డివిజన్, పాత ఐటీఐ సమీపంలో చిన్నబోయిన అంజి నివాసం వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి మూడు చోట్ల భారీ పగుళ్లు (క్రాకులు) ఏర్పడి, ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని వార్త సంధ్య కథనం ద్వారా వెలుగులోకి తీసుకొచ్చింది. కథనం ప్రచురితమైన వెంటనే సుజాతనగర్ విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదకర స్థితిలో ఉన్న పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు, కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, ఆలస్యం చేయకుండా చర్యలు చేపట్టిన సుజాతనగర్ విద్యుత్ శాఖ అధికారులను స్థానికులు అభినందించారు. అలాగే ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వార్త సంధ్య పత్రికకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఇదే విధంగా స్పందిస్తూ, ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, తీగలను కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కొత్తగూడెం 1 టౌన్ సీఐ కర్ణాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 04 (వార్త సంధ్య) :** కొత్తగూడెం 1 టౌన్ సీఐ కర్ణాకర్ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు ఎం.డి. హుస్సేన్ ఆధ్వర్యంలో శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కర్ణాకర్‌కు మిఠాయి తినిపించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మహిళా నాయకురాలు మెదిని లక్ష్మి, సుందర్ లాల్, శేఖర్, అన్వార్, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

## అన్వేషణ విభాగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

**నూతన అధికారులను కలిసి కార్మికుల సమస్యలు వివరించిన ఎఐటియుసి నాయకులు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 4 (వార్త సంధ్య) :** సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని అన్వేషణ (ఎక్స్‌ప్లోరేషన్) విభాగ అభివృద్ధికి యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎఐటియుసి నాయకులు కోరారు. అన్వేషణ విభాగంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జనరల్ మేనేజర్ కే. పంకజ్, హెచ్‌ఓడీ (డీజీఎం) వీర్రాజులను కార్పొరేట్ ఎఐటియుసి బ్రాంచ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి మాట్లాడుతూ, అన్వేషణ విభాగం సింగరేణి భవిష్యత్ అభివృద్ధికి కీలకమైందని, అందువల్ల ఈ శాఖ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కార్మికుల పదోన్నతి విధానంలో ఉన్న సమస్యలను పరిష్కరించి, అర్హత, సీనియారిటీ ఆధారంగా పారదర్శకంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అలాగే బొగ్గు నిల్వల అన్వేషణను వేగవంతం చేసేందుకు డ్రిల్లింగ్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రస్తుతం వినియోగంలో ఉన్న పాత డ్రిల్లింగ్ యంత్రాల స్థానంలో అత్యాధునిక సాంకేతికత కలిగిన కొత్త యంత్రాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల పనుల నాణ్యతతో పాటు ఉత్పాదకత కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. అన్వేషణ విభాగ వర్క్‌షాప్‌కు ఆధునిక యంత్ర పరికరాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని కోరారు. సాంకేతిక సిబ్బందికి అవసరమైన శిక్షణ, భద్రతా పరికరాలు, పని వాతావరణంలో మెరుగుదలపై కూడా యాజమాన్యం దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా అన్వేషణ విభాగంలో నెలకొన్న పలు కార్మిక, పరిపాలనా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమం, శాఖ అభివృద్ధి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారమైతే సంస్థ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు కార్మికులకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారంలో సానుకూలంగా వ్యవహరించాలని ఎఐటియుసి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి, సహాయ కార్యదర్శి సామల రాము, ఉపాధ్యక్షుడు కె.డబ్ల్యూ. క్రిస్టఫర్, పిట్ కార్యదర్శి బండి సదానందం, పిట్ సహాయ కార్యదర్శి తుమ్మ రవికుమార్, దావా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శంకర్, ఉమామహేశ్వరరావు, పుల్లాచారి, నవ్య, అనూష, తిరుమలరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి మనుగడకు కేంద్రం జోక్యం చేసుకోవాలి

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 4 (వార్త సంధ్య) :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) మనుగడను కాపాడేందుకు, సంస్థ ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కేంద్ర మంత్రిని కలిసి సింగరేణి ఆర్థిక బలోపేతం, కొత్త బొగ్గు గనుల కేటాయింపు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల వసూళ్లు తదితర అంశాలపై సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ప్రస్తుతం తీవ్ర ఆర్థిక, కార్యనిర్వాహక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల సంస్థ ఆర్థిక పరిస్థితి బలహీనపడిందని, పలు గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో భవిష్యత్తులో కొన్ని గనులు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో తదితర సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తాడిచెర్ల బొగ్గు బ్లాక్--××, మణుగూరు పీకే ఓసీ --×× డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులను సింగరేణికి కేటాయించాలని, అలాగే ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్--××లో సుమారు 277 మిలియన్ టన్నులు, మణుగూరు పీకే ఓసీ--×× డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులో 215 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ గనులు సింగరేణికి దక్కితే సంస్థ భవిష్యత్తు మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత లభిస్తుందని వివరించారు. మణుగూరు ప్రాంతంలోని ప్రస్తుత గనుల్లో బొగ్గు నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో పీకే ఓసీ--×× డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు సింగరేణికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఫైనాన్షియల్ బిడ్ వేలంలో సింగరేణి తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకుని, వేలం ద్వారా ఆ గనిని సింగరేణికే కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. బొగ్గు తవ్వకాల రంగంలో శతాబ్దకాల అనుభవం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, సమర్థవంతమైన యంత్రాంగం, బలమైన మౌలిక సదుపాయాలు సింగరేణికి ఉన్నాయని, ఈ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహించే పూర్తి సామర్థ్యం సంస్థకు ఉందని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమీక్ష నిర్వహించి, కొత్త గనుల కేటాయింపు, బకాయిల వసూళ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. దీంతో వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతతో పాటు తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి, దేశ ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

## సఖి మహిళా మండలి పేరుతో పదవుల ఎర..

**మహిళల నుంచి వేలల్లో వసూళ్లు..?**

**సఖి మహిళా మండలి అధ్యక్షులు ఎవరు..?**

**మహిళా మండలి మహిళల కోసమా.. లేక మగవారి కోసమా..?**

**ఢిల్లీ పదవికి ఒక రేటు.. రాష్ట్ర పదవికి మరో రేటు**


**రూ.500 నుంచి రూ.50 వేల వరకు మహిళల నుంచి డబ్బుల వసూళ్లు**

**త్వరలో నియామక పత్రం వస్తుంది" అంటూ నమ్మబలికినట్లు ఆరోపణలు**

**తాండూరు ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తామని రూ.30 వేల వసూలు**

**ప్రశ్నించిన మహిళలకు బెదిరింపులు,**

**మాయమాటలతో తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణలు**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 04 (వార్త సంధ్య) :** రాష్ట్రంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు సేవా సంస్థలు, మహిళా సంఘాలు, సొసైటీలు, రాజకీయ పార్టీల పేర్లను అడ్డంగా ఉపయోగించుకుని డబ్బులు వసూలు చేసే కొత్త తరహా మోసాలు వెలుగుచూస్తున్నాయని పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, "సఖి మహిళా మండలి" పేరుతో ఒక వ్యక్తి మహిళలను సంప్రదించి, సభ్యత్వాలు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పదవులు ఇప్పిస్తానని నమ్మబలుకుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, భవిష్యత్తులో రాజకీయ అవకాశాలు కూడా కల్పిస్తామని, ఎమ్మెల్యే, ఎంపీ వంటి పదవులకు అవకాశం ఉంటుందని చెప్పి మహిళలను ఆకర్షిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట సభ్యత్వ రుసుము పేరుతో రూ.500 నుంచి ప్రారంభించి, తర్వాత జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీ పదవుల పేరుతో రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు డబ్బులు తీసుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు. కొందరి వద్ద అయితే లక్ష రూపాయల వరకు వసూలు చేసిన ఘటనలు కూడా ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా తాండూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఇప్పిస్తామని చెప్పి ఒక మహిళ నుంచి రూ.30 వేల వరకు తీసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "డబ్బులు చెల్లిస్తే పదవి ఖాయం, నియామక పత్రం త్వరలో వస్తుంది" అంటూ నమ్మబలికి డబ్బులు వసూలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు చెల్లించిన తర్వాత పదవులు రాకపోవడంతో కొందరు మహిళలు నిలదీయగా, "మీకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు. మా సఖి మహిళా మండలికి కోట్ల రూపాయల నిధులను కలెక్టర్ మంజూరు చేయబోతున్నారు. మీకు పదవి రావద్దనే ఉద్దేశంతో కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు" అంటూ మాయమాటలతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని వారు చెబుతున్నారు. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే పలువురు మహిళలు మోసపోయామని ఒకరికి ఒకరు సమాచారం అందించుకుంటున్నారని తెలుస్తోంది. అయితే కొత్తగా చేరే వారికి మాత్రం వాస్తవాలు తెలియకుండా, తప్పుడు హామీలు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా సాధికారత, సేవా కార్యక్రమాలు, రాజకీయ అవకాశాల పేర్లతో అమాయక మహిళలను మోసం చేయడం అత్యంత దురదృష్ట కరమని పలువురు సామాజికవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి వ్యవహారాలపై పోలీసులు, సంబంధిత ప్రభుత్వ శాఖలు, మహిళా కమిషన్, జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బాధితులు కోరుతున్నారు. అదేవిధంగా, "సఖి మహిళా మండలి" పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థకు చట్టబద్ధ గుర్తింపు ఉందా? అధ్యక్షులు ఎవరు? నిధుల వనరులు ఏమిటి? మహిళల నుంచి వసూలు చేస్తున్న డబ్బుకు అధికారిక రసీదులు ఇస్తున్నారా? రాజకీయ పదవులు ఇప్పించే అధికారాన్ని ఎవరు కల్పించారు? వంటి అంశాలపై కూడా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి నిర్ణయానికి ఉద్యోగుల హర్షం

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కేక్ కట్ చేసినా ఉద్యోగులు**

**ప్రతి నెల ఒకటో తేదీన జీతాల చెల్లింపు నిర్ణయానికి కృతజ్ఞతలు**



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (వార్త సంధ్య):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఉద్యోగులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఉద్యోగుల ప్రతినిధి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో ఒక కీలకమైన మలుపుగా నిలిచిందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందడం అనేది కేవలం వేతనం అందుకోవడం మాత్రమే కాదని, వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా, జీవన భద్రతను కల్పించే నిర్ణయమని పేర్కొన్నారు. ఇంటి అద్దె, పిల్లల విద్య, బ్యాంకు రుణాల చెల్లింపులు, కుటుంబ అవసరాలు వంటి ఆర్థిక బాధ్యతలను సకాలంలో నిర్వహించుకునే అవకాశం ఈ నిర్ణయంతో కలిగిందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, సంబంధిత మంత్రివర్గ సభ్యులు, అధికారులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా జిల్లా గ్రంథాలయ సంస్థ భద్రాద్రి కొత్తగూడెం చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో చైర్మన్ చేసిన కృషిని ఈ సందర్భంగా ఉద్యోగులు అభినందించారు. భవిష్యత్తులో కూడా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని సంక్షేమ నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ గ్రంథపాలకురాలు జి. మణి మృదుల, గ్రంథాలయ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్లాక్ మనీ పేరుతో భారీ మోసం

**రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షలు..**

**12 మంది అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్..**

**రూ.18 లక్షల నగదు, నకిలీ పోలీసు యూనిఫాంల స్వాధీనం**



**సత్తుపల్లి, జూలై 4 (వార్త సంధ్య) :** రూ.10 లక్షలు ఇస్తే ప్రతిగా రూ.40 లక్షల బ్లాక్ మనీ ఇస్తామని ఆశ చూపించి అమాయకులను మోసం చేస్తున్న 12 మంది సభ్యులతో కూడిన అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ముఠాలోని ఓ సభ్యుడు బాధితులకు ఫోన్ చేసి తన వద్ద రూ.2 కోట్ల బ్లాక్ మనీ ఉందని, దాన్ని వైట్‌గా మార్చుకోవాల్సి ఉందని చెబుతాడు. ఇందుకు రూ.10 లక్షలు నగదుగా ఇస్తే, ప్రతిగా రూ.40 లక్షలు అందజేస్తానని నమ్మించి ఒప్పిస్తాడు. బాధితుడు డబ్బులతో వచ్చిన తర్వాత, నకిలీ నోట్లతో నింపిన బ్యాగ్‌ను తన అనుచరుడి ద్వారా అందజేస్తారు. అదే సమయంలో ముఠాలోని మరికొందరు నకిలీ పోలీసుల వేషంలో అక్కడికి చేరుకుని దాడి చేస్తారు. దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నారని, మోస్ట్ వాంటెడ్ నేరస్థులని బెదిరిస్తూ బాధితుడి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుని అక్కడి నుంచి పరారవుతారు. ఈ మోసానికి ప్రొద్దుటూరుకు చెందిన గంగాధర్‌రెడ్డి గురికావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ప్రణాళికతో ముఠాను పట్టుకుని మొత్తం 12 మంది నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.18 లక్షల నగదు, 16 మొబైల్ ఫోన్లు, నకిలీ పోలీసు యూనిఫాంలు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



## రవీంద్రభారతిలో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన ఉస్తాద్ సికిందర్ ఖాన్ గజల్ గానామృతం




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 4.:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 95వ రోజు (04-07-2026) రవీంద్రభారతిలోని పాల్కురికి సోమన్న మూల వేదిక సంగీత రసికులతో కళకళలాడింది. ప్రముఖ గజల్ గాయకుడు ఉస్తాద్ సికిందర్ ఖాన్ తన హృదయాన్ని హత్తుకునే గజల్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూ సంగీతానుభూతి లోకంలో విహరింపజేశారు. ఆయన ప్రతి గజల్‌కు ప్రేక్షకుల నుంచి ఘనమైన చప్పట్లు, ప్రశంసలు వెల్లువెత్తడంతో సభా ప్రాంగణం మారుమ్రోగింది. ఈ సంగీత విభావరికి తబ్లాపై నజీముద్దీన్, కీబోర్డుపై రఫీ బక్ష్, ఆక్టోప్యాడ్‌పై తాజ్ బక్ష్ తమ అద్భుతమైన సహకారాన్ని అందించి గజల్ గానాన్ని మరింత రసవత్తరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్ సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార్ కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే సాంస్కృతిక సలహా మండలి సభ్యులు శ్రీ ముచర్ల దినకర్, శ్రీ పల్లె నర్సింహ కార్యక్రమానికి హాజరై కళాకారుల ప్రతిభను ప్రశంసిస్తూ వారిని అభినందించారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సమాజంలో నెలకొన్న వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించే చైతన్య గీతాలతో పాటు జానపద గీతాలను ఆలపించి సభలో ఉత్తేజభరితమైన వాతావరణాన్ని నెలకొల్పారు. వారి ప్రదర్శన ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణను పొందింది. ఈ కార్యక్రమానికి విద్యానందాచారి శ్రీనివాస రాజు వ్యాఖ్యాతలుగా వ్యవహరించి తమ హుందాతనంతో కూడిన వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని ఆద్యంతం ఆసక్తి కరంగా, విజయవంతంగా నిర్వహించారు. సంగీతం, సాహిత్యం, సంస్కృతి సమ్మేళనంగా సాగిన ఈ గజల్ సాయంత్రం ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయ ముద్ర వేసింది.

## మతిమరుపు నేషనల్ హైవే అధికారులు?.. ప్రాణాలు పోయినా గుంతలకు మాత్రం శాశ్వత పరిష్కారం లేదు!

**హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు దుస్థితి.. మరో ప్రమాదం ఎప్పుడు?**

**రెండు నెలల క్రితం ప్రాణాలు కోల్పోయినా.. అధికారులకు ఇంకా మెలకువ రాలేదా?**

**వర్షాలతో మరింత ప్రమాదకరంగా మారిన జాతీయ రహదారి**



**చండ్రుగొండ ప్రతినిధి,(వార్త సంధ్య) జూలై 4.:** చంద్రుగొండ నుంచి కొత్తగూడెం వెళ్లే జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రహదారి గుంతలు వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, ఇదే ప్రాంతంలో రెండు నెలల క్రితం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని ప్రాణనష్టం జరిగినప్పటికీ రహదారి సమస్యకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా ప్యాచ్‌వర్క్ చేసినా మళ్లీ గుంతలు ఏర్పడడంతో ద్విచక్రవాహనదారులు, భారీ వాహనాల డ్రైవర్లు ప్రమాద భయంతో ప్రయాణిస్తున్నారు. వర్షాల కారణంగా గుంతలు మరింత ప్రమాదకరంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత నేషనల్ హైవే అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరో ప్రమాదం జరిగేలోపు అధికారులు స్పందించి రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మాలలకు రోస్టర్ విధానంలో 22 శాతం ఉంటే అదే మాదిగలకు 80 శాతం నుండి 97 శాతం పోస్టర్ విధానం అమలవుతుందని కోఆర్డినేషన్ ఫోరం డాక్టర్ గోపీనాథ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో మాలలకు అన్యాయం జరుగుతుందని డాక్టర్ తిరుపతయ్య ఆరోపించారు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 4 :** సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే న్యాయం చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు రోస్టర్ విధానం వల్ల ప్రభుత్వ చిన్న శాఖల్లో మాలలకు ఉద్యోగాలు కూడా రావడం లేదని ఆరోపించారు తక్షణమే రోస్టర్ విధానం సవరించి మా వాళ్లకు న్యాయం చేయాలని ఆయన కోరారు రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ ఫోర్త్ క్లాస్ నియమకాలలో మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు ఆర్టీసీ, ఇతర శాఖలో కూడా మాలలకు తీవ్ర అన్యాయం జరిగింది ఆయన ఆరోపించారు మాలలు 264 రోస్టర్ విధానంలో ఉద్యోగాలు కోల్పోయారని ఆయన విమర్శించారు తక్షణమే వాటిని భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో బండ శకుంతల, శంకర్ పాల్గొని ప్రసంగించారు

## రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 4 :** మిత్రులారా...రేవంత్ అన్నకి మాకు 2016 నుండి జూన్ 2 వ తేదీ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు తెలంగాణ జనజాతర బారి బహిరంగ సభకు ఆహ్వానం పలకడానికి ఎన్టీఆర్ భవన్ లో దాధాపు 2 గంటల చర్చ, భవిష్యత్తు రాజకీయాలు తెలం గాణలో ఎట్లుంటవో ముందే మాట్లాడటం, మీ ఉస్మా నియా లీడర్ లు నాకు సపోర్ట్ ఉంటె మనమే తెలం గాణాలో ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేస్తాము అని చెప్పిన మాటల సందర్బం సరిగ్గా ఉదయం 11.30 గంటలు చాయ్ తాగుతూ మాట్లా డిన మాటలు ఈ సంధర్భములో నా చెవులలో విన బడు తున్నవి అందుకే మిత్రులారా క్రుషి , పట్టుదల, నిజా యితీ, నీతి మరియు చక్కని ప్రవర్తనా నియ మావాలి ఉంటె ఈ సమాజం మనల్ని నడిపిస్తుంది ఈ సభ చేసినందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మాపై కోర్టు ధిక్కరన కేసులు పెట్టాడు అందులో రేవంత్ ఏ1 నిందితుడు ఇప్పటికి కోర్టు పెషికి నోటీసులు వస్తునే ఉంటవి...

## బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడు : బండి భగీరథ్ కేసులో హైకోర్టుకు పోలీసులు

**పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడికి బెయిల్ ఇవ్వొద్దన్న పోలీసులు**

**హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిన దర్యాప్తు అధికారులు**

**మైనర్‌ను లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు**

బండి సాయి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని తెలంగాణ పోలీసులు హైకోర్టును కోరారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోక్సో కేసులో ఈ మేరకు పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పోలీసులు తమ అఫిడవిట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. విజయవర్ధన్ జులై 3న దాఖలు చేసిన కౌంటర్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. 17 ఏళ్ల బాలికతో పరిచయం పెంచుకున్న భగీరథ్, ఆమెను లోబర్చుకుని 2025 నుంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీరామ్ గార్డెన్స్, నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో ఈ ఘటనలు జరిగినట్లు తెలిపారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న భగీరథ్, తాను నిర్దోషినని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపిస్తూ రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం, తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది.

# కేసీఆర్ చేసిన అప్పులు రూ.8,21,651 కోట్లు

**బీఆర్ఎస్ కు వెనుకా.. ముందు ఏమీ లేదు**

**మేం చేసిన అప్పులు లక్ష 77 వేల కోట్లు అప్పులు చేశాం**

**మీరు చేసిన అప్పులకు రూ. 2,08,681 కోట్లు చెల్లించాం**

**అబద్దాలతో విష ప్రచారం**

**నిజాలతో నిఖార్సుగా ప్రజలముందుకు మేము**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 4 :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై హరీష్ రావు, కేటీఆర్ చేస్తున్న విమర్శలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిప్పులు కురిపించారు. ఎవరి స్థాయి ఏమిటనేది ఇప్పటికే ప్రజలు నిర్ణయించారు. అయినా స్థాయి అనేది పుట్టుకను బట్టి రాదు.. ప్రజాజీవితంలో పోషించే పాత్రను బట్టి వస్తుందని కేటీఆర్, హరీష్ రావులకు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో చురకలు అంటించారు. శుక్రవారం నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పదేళ్ల పాటు అధికారంలో ఉండి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రచార అస్త్రాలుగా అబద్ధాలు

పదేళ్లలో జరిగిన అడ్డగోలు దోపిడీ, అప్పులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. ఆ అస్తవ్యస్త పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నంలో మేమున్నాం. అబద్ధాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకుని, 'గోబెల్స్' ప్రచారానికి పాల్పడటం ప్రతిపక్షాలకు అలవాటుగా మారిందని అన్నారు. పాలనపై దృష్టి సారిస్తూ, రాష్ట్ర ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు వాస్తవాలను వెల్లడించడానికి సంయమనం పాటించాం. ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా నిరంతరం విషప్రచారం సాగిస్తుంటే, చూస్తూ ఊరుకోవడం రాష్ట్రానికి మరింత నష్టదాయకమని ఆయన పేర్కొన్నారు. హరీష్‌రావు, కేటీఆర్‌ల వైఖరిపై విస్మయం వ్యక్తం చేస్తూ, "ఒకవైపు ముఖ్యమంత్రికి, మంత్రులకు ఛాలెంజ్ విసురుతూనే, మరోవైపు మళ్లీ కేసీఆరే అధికారంలోకి వస్తారని మీరే చెప్పుకుంటున్నారు. అటువంటప్పుడు మధ్యలో మీ పాత్ర ఏమిటి? మీరు ఏం మాట్లాడుతున్నారో మీకే అవగాహన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలను పోగేసి ప్రచారం చేయడం తప్ప, ప్రజలకు మీరు చేసిందేమీ లేదని భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శించారు. అబద్ధాల పునాదుల మీద ఏ ఆర్థిక వ్యవస్థను నిర్మించలేమని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అడ్డగోలుగా అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆయన అన్నారు. ఆర్థిక విధ్వంసం చేసిన మీరే ఇవాళ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరుతో హరీష్‌రావు, కేటీఆర్‌లు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆయన ఖండించారు. బీఆర్ఎస్ హయాంలో అంటే 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అప్పుల చిట్టా మా దగ్గర స్పష్టంగా ఉంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసినవి, కార్పొరేషన్ల పేరుతో తీసుకున్న ప్రభుత్వ గ్యారంటీ రుణాలు, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, డిస్కంల బాకీలు.. ఇలా అన్ని రకాల అప్పులను కలిపితే మొత్తం రూ. 8,21,651 కోట్లు. ఇది వాస్తవం కాదా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అప్పులన్నీ కేసీఆర్ ప్రభుత్వం చేసినవేనని, వీటికి వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసెంబ్లీ సాక్షిగా అప్పులపై శ్వేతపత్రం విడుదల చేశామని ఈ సందర్భంగా భట్టి గుర్తుచేశారు. కేసీఆర్ చేసిన అప్పులకు సంబంధించి కేవలం రెండున్నరేళ్లలోనే ప్రజాప్రభుత్వం రూ. 2,08,681 కోట్లను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు చెల్లించిందని ఆయన ప్రకటించారు. కేవలం రూ. 3 లక్షల కోట్లే అప్పు చేశామని హరీష్‌రావు అబద్ధాలు చెబితే, మరి రిజర్వ్ బ్యాంక్ ద్వారా ప్రభుత్వ ఖాతాల నుంచి కట్టేసిన ఆ భారీ మొత్తం దేనికో వారే సమాధానం చెప్పాలి" అని సవాల్ విసిరారు. ప్రతిపక్ష నేతల వైఖరిపై విమర్శలు గుప్పిస్తూ గతంలో మీరు పాలన చేశారు, భవిష్యత్తులోనూ కేసీఆరే వస్తారని మీరే చెప్పుకుంటున్నారు. అటువంటప్పుడు మధ్యలో మీరు చేసే ఈ హంగామా దేనికోసం? గతం లేదు, భవిష్యత్తు లేదు.. కనీసం నైతికత అయినా ఉండాలి కదా!" అని ఆయన ఎద్దేవా చేశారు. ?అబద్ధాల పునాదుల మీద రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టేసిన వారు, ఇప్పుడు ఆ అప్పులను దాచాలని చూడటం సాధ్యం కాదని, రికార్డులన్నీ ప్రజల ముందున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్ర ప్రతిష్టను కాపాడాలన్న ఉద్దేశంతోనే ఇంతకాలం మౌనంగా ఉన్నామని, కానీ అబద్ధపు ప్రచారాలు పెరగడంతో వాస్తవాలను బయటపెట్టాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డగోలుగా చేసిన అప్పులను సమర్థవంతంగా నిర్వహించి, రాష్ట్ర ఆర్థిక భారాన్ని తగ్గించే దిశగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఒకవైపు నెలనెలా ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తూనే రైతు భరోసాతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజాప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్లే.. ఇదంతా సాధ్యమవుతోందని ఆయన స్పష్టంగా చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ బ్యాంకుల వద్ద 10 శాతం నుంచి 10.5 శాతం వరకు భారీ వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చి రాష్ట్రంపై పెనుభారం వేసిందని ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఆ అప్పులను డెబిట్ రీస్ట్రక్చరింగ్ ప్రక్రియలోకి తీసుకువచ్చిందని చెప్పారు. దీనివల్ల 2025-26 నుంచి 2031-32 మధ్య కాలంలో చెల్లించాల్సిన రూ. 34,058 కోట్ల రుణ భారాన్ని, రూ. 11,915 కోట్లకు తగ్గించామని చెప్పారు. దీని ద్వారా రాష్ట్రానికి రూ. 22,142 కోట్లు ఆదా జరిగిందని అన్నారు. అడ్డగోలుగా అప్పులు తెచ్చిన వారు, ఇలాంటి ఆర్థిక నిర్వహణపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిప్యూటీ సీఎం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అప్పులను ఎలా దాచిపెట్టిందో భట్టి విక్రమార్క వివరించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్ల పేరుతో భారీగా అప్పులు తీసుకున్నారు. అప్పట్లో ఆ అప్పులను రైతులే కడతారని, పన్నుల ద్వారా వసూలు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు ఆ అప్పులను, వడ్డీలను చెల్లించేది ఎవరు? రాష్ట్ర ప్రభుత్వం కాదా? ప్రజల పన్నులతోనే కదా ఈ భారాన్ని మోస్తున్నాం? వాటన్నింటినీ అప్పులుగా చూపించకుండా గత పాలకులు రాష్ట్రాన్ని మోసం చేశారు" అని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పారదర్శకంగా ప్రజల ముందుంచుతున్నామని, వ్యవస్థలను ప్రక్షాళన చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం చెల్లిస్తున్న ప్రతి రూపాయి వెనుక ప్రజల కష్టం ఉందని, దీనిని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం కాకుండా, సభకు వచ్చి వాస్తవాలపై చర్చించాలని ఆయన ప్రతిపక్ష నాయకులను సవాల్ చేశారు.




### సింగరేణిపై విషప్రచారం ఆపండి!

సింగరేణి సంస్థపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని భట్టి విక్రమార్క తప్పుబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆస్తులు, వనరులు రాష్ట్రానివి. పదేళ్ల మీ పాలనలో సింగరేణికి కొత్తగా ఒక్క కోల్ బ్లాక్‌నైనా తీసుకువచ్చారా? కనీసం ఉత్పత్తి అయిపోయి మూతపడిన మైనింగ్ బ్లాకులకు బదులుగా కొత్తవి తెచ్చారా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులను భారీగా విస్తరించిన కేసీఆర్ ప్రభుత్వం, వాటికి అవసరమైన బొగ్గు గనులను మాత్రం ఎందుకు సమకూర్చలేదని ఆయన తీవ్రస్థాయిలో నిలదీశారు. కేంద్రం వేలం వేసిన కోల్ బ్లాకుల్లో పాల్గొని సింగరేణికి ఆ గనులను ఎందుకు దక్కించుకోలేదు? సింగరేణికి గనులు వస్తే రాయల్టీ రూపంలో వచ్చే ఆదాయం తెలంగాణకే చెందేది కదా? అటు కొత్త గనులు తేరు, ఇటు వేలంలో పాల్గొనరు.. అంటే రాష్ట్రంలో బొగ్గు కొరత సృష్టించి, విద్యుత్ ప్రాజెక్టులను సంక్షోభంలోకి నెట్టడమే మీ ఉద్దేశమా?" అని భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ లబ్ధికోసం అబద్ధపు ఛాలెంజ్‌లు విసిరే బీఆర్ఎస్ ను ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పారని అన్నారు. సింగరేణి కాలరీస్‌లో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అస్తిత్వం, కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు చేస్తున్న దుష్ప్రచారమని ఉప ముఖ్యమంత్రి మండిపడ్డారు. సింగరేణి సంస్థలో ఎటువంటి అక్రమాలకు తావులేదని, సంస్థ భద్రత కోసం అత్యున్నత స్థాయి జియో-ఫెన్సింగ్ వ్యవస్థ ఉందని ఆయన స్పష్టం చేశారు. కోయగూడెం, సత్తుపల్లి-3 వంటి బొగ్గు బ్లాకులను సింగరేణికి దక్కకుండా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన మండి పడ్డారు. వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంలో కేసీఆర్ సర్కార్ పాత్ర ఉందన్నారు. దాదాపు 65 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న సత్తుపల్లి-3 బ్లాకును ప్రైవేటు వారికి ఎందుకు ఇచ్చారు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. సింగరేణిని ఆర్థికంగా దెబ్బతీసి, థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు కొరత సృష్టించి, ప్రైవేటు వ్యక్తుల నుంచి బొగ్గు కొనుగోలు చేయాలన్నదే బీఆర్ఎస్ ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచన అని ఆయన ఆరోపించారు.

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తుంటే, ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారంతో సంస్థ ప్రతిష్టను మంటగలుపుతున్నారని భట్టి విమర్శించారు. బొగ్గు మాయమైందన్న ఆరోపణలను ఖండించిన ఆయన, సింగరేణిలో వ్యవస్థలు చాలా పటిష్టంగా ఉన్నాయి. ఒక్క కేజీ బొగ్గు కూడా అక్రమంగా బయటకు వెళ్లే అవకాశం లేదు. తెలంగాణ ప్రజల ఆస్తిని, 40 వేల మంది కార్మికుల జీవితాలను దెబ్బతీసేలా ప్రతిపక్షాలు వ్యవహరించడం సరికాదని ఆయన హెచ్చరించారు. ప్రతిపక్షాలు పదే పదే బొగ్గు మాయమైందని చేస్తున్న ఆరోపణలను ప్రభుత్వం సవాలుగా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. "సింగరేణి సంస్థ సొంత బిడ్డ వంటిది. 40 వేల మంది కార్మికుల జీవితాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి. సంస్థపై అనవసరపు అభాండాలు వేయడం తెలంగాణకే నష్టం. ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించాను. వారు సమగ్ర విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారు. వాస్తవాలు ప్రజల ముందుంచే బాధ్యత మాదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను, సంక్షేమ పథకాలను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్ష నేతలు చేస్తున్న అబద్ధపు ప్రచారంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సౌకర్యాల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేని ప్రతిపక్ష నేతలు హరీష్‌రావు, కేటీఆర్‌లు రాజకీయ లబ్ధి కోసం దిగజారి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లలో ఇరిగేషన్, రోడ్ల నిర్మాణాల పేరుతో ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచిన మీరు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలు తినే ఆహారానికి గానీ, వారి కాస్మెటిక్ ఛార్జీలకు గానీ రేట్లు ఎందుకు పెంచలేదు?" అని ప్రశ్నించారు. డైట్ ఛార్జీలను ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు పెండింగ్‌లో పెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన ఘనత గత ప్రభుత్వానిదేనని ఆయన దుయ్యబట్టారు. ప్రస్తుత ప్రభుత్వం బాధ్యత చేపట్టిన తర్వాత హాస్టళ్ల నిర్వహణను పూర్తిగా ప్రక్షాళన చేశామని భట్టి వివరించారు. పిల్లల కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతంపెంచాము. డైట్ ఛార్జీలను ప్రతి నెలా మొదటి వారంలోనే అందేలా స్ట్రీమ్ లైన్ చేశాము. నాణ్యతతో కూడిన దుస్తులు, షూస్, పుస్తకాలను ఓపెన్ టెండర్ల ద్వారా పారదర్శకంగా అందిస్తున్నాము. టెండర్ విలువ రూ. 1,142 కోట్లు ఉంటే, గతంలో రూ. 2,000 కోట్ల మేర దోపిడీ జరిగిందని ఆరోపించిన వారు, ఒకసారి రూ. 3,000 కోట్లు అని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?" అని నిలదీశారు. ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న మంత్రులపై అడ్డగోలు విమర్శలు చేయడం ప్రతిపక్షాలకు తగదని ఉప ముఖ్యమంత్రి హితవు పలికారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, దోపిడీకి కారణమైన కేసీఆర్ గారు ఎందుకు బయటకు రారు? ఈ అప్పులు, ఈ దోపిడీపై చర్చకు ఆయన ఎందుకు సిద్ధపడరు? ప్రతిపక్ష నాయకులుగా కనీస నిబద్ధత, బాధ్యత లేకుండా అబద్ధాలు ప్రచారం చేస్తే ప్రజలు క్షమించరని హెచ్చరించారు. ?ప్రభుత్వం ప్రతి పనిని పారదర్శకంగా నిర్వహిస్తోందని, నిరాధారమైన ఆరోపణలతో రాష్ట్రాన్ని, సమాజాన్ని ఇబ్బందులకు గురిచేసే కార్యక్రమాలు ఆపాలని ఆయన సూచించారు. "తెలంగాణ ప్రజల ఆస్తిని, కార్మికుల చెమటను కాపాడే బాధ్యత మాది. అబద్ధాల పునాదులపై రాజకీయాలు చేయడం మానుకోండి" అని భట్టి విక్రమార్క ప్రతిపక్షాలకు స్పష్టం చేశారు. శాసనసభకు హాజరుకాని ప్రతిపక్ష నేతపై భట్టి విక్రమార్క తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్ష నేతగా నా అటెండెన్స్ రికార్డులను ఎవరైనా చూసుకోవచ్చు. నేను ఒక్క రోజు కూడా అసెంబ్లీని మిస్ కాలేదు. కానీ, ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ సభకు రాకుండా, బాధ్యత లేకుండా విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు. వ్యక్తుల స్థాయిని వారి పుట్టుకతో కాదు, వారు పోషించే పాత్ర, వారు చేసే పనితోనే నిర్ణయిస్తారని ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు.

# ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

**2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం**

**తన తొలి గెలుపునకు వేదికైన మిడ్జిల్‌లో కృతజ్ఞతా కార్యక్రమం**


**జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగిన రాజకీయ ప్రయాణం**

**ప్రజల ఆకాంక్షల నెరవేర్పుకే కృషి చేస్తానన్న రేవంత్**



ప్రజా ప్రతినిధిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో శనివారం ఆయన పర్యటించారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం, 2006 జులై 4న ఇదే మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి, 2007లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, 2018 ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ పట్టువదలకుండా 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఘనవిజయం సాధించారు. 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టి, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మిడ్జిల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఉర్కొండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తన రాజకీయ ప్రస్థానం తొలినాళ్లలో అండగా నిలిచిన మద్దతుదారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ తన రెండు దశాబ్దాల ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి ప్రతి గుండెలో 'రేవంత్ అన్న' వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం" అని ఆయన 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహా పలువురు నేతలు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన ప్రస్థానానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.

# పడక గది పచ్చగా..



పడక గది పచ్చగా కళకళలాడాలంటే.. కుండీల్లో మొక్కలను పెంచుకోవాల్సిందే! కాకుంటే.. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే సూర్యరశ్మి కావాల్సిందే! అలాంటప్పుడు సూర్యరశ్మి అవసరం లేని మొక్కలను ఎంచుకుంటే చాలు. కొన్ని మొక్కలు తక్కువ కాంతిలోనే చక్కగా పెరుగుతాయి. కాబట్టి, బెడ్రూములోనూ వాటిని భేషుగ్గా పెంచుకోవచ్చు.

**ఫిలోడెండ్రాన్ ప్లాంట్ :** గాలిని శుద్ధి చేయడంలో ఈ మొక్క సమర్థంగా పనిచేస్తుంది. కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇల్లు కట్టుకున్నవారికి ఈ మొక్క వరంలాంటిదే! దీన్ని కుండీలో పెంచుకొని.. పడగ గదిలో ఓ మూలన పెట్టేస్తే చాలు. తగినంత సూర్యరశ్మి లేకున్నా.. చక్కగా పెరుగుతుంది. గాలిని శుద్ధి చేస్తుంది. దీన్ని పెంచడం కూడా చాలా సులభం. చీడపీడలు సోకే అవకాశం కూడా ఉండదు. తగినన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది.

**సింగోనియం ప్లాంట్ :** దీనికే 'యారోహెడ్' అని పేరు. ఈ మొక్క ఆకులు బాణపు తలల్లా ఉంటాయి. కాబట్టే.. ఆ పేరొచ్చింది. ఇవికూడా సులభంగా పెరుగుతాయి. ఆక్సిజన్‌ను పుష్కలంగా అందిస్తుంది. గాలిని శుద్ధి చేస్తుంది. చిన్నచిన్న కుండీల్లోనూ చక్కగా పెరుగుతాయి. పడక గదికి కొత్త అందాన్ని తీసుకొస్తాయి.

# బరువు తగ్గాలనుకుంటున్నారా?

**రోజూ ఇలా ట్రై చేస్తే మంచిదంటున్న నిపుణులు!**

**బరువును అదుపులో పెట్టుకోవడం పెద్ద కష్టమేమీ కాదట!**

**ఏం చేయాలో వివరిస్తున్న నిపుణులు!**




బరువు తగ్గటమనేది అంత త్వరగా సాధ్యమయ్యేది కాదు. దీనికి కాస్త సమయం పడుతుంది. డైటింగ్, చక్కటి పోషకాహారం తీసుకోవడం, వ్యాయామ నియమాలను పాటించటం అత్యవసరం. అధిక బరువుతో డయాబెటిస్, హైబీపీ వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు పెరగడంతో పాటు కొన్నిరకాల క్యాన్సర్లూ తలెత్తొచ్చని నిపుణులు చెబుతున్నారు. వయసు మీద పడుతున్నప్పుడు చురుకుదనమూ తగ్గుతుందని పేర్కొంటున్నారు. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు. అలాగని మరీ త్వరగా బరువు తగ్గటమూ మంచిది కాదంటున్నారు. దీనికీ ఒక పద్ధతి ఉందని సూచిస్తున్నారు. మరి, అదెంటో ఇప్పుడు తెలుసుకుందాం!శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల అదనపు శక్తి కొవ్వుగా మారి, బరువు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. సమతులాహారం తినకపోవటం, నిద్రలేమి, తగినంత శ్రమ చేయకపోవటం వంటి రకరకాల అంశాలు దీనికి కారణమవుతుంటాయని అంటున్నారు. అలాగే, బరువు పెరగటంలో కొన్ని రకాల జన్యువులు, మందులూ దీనికి దోహదం చేయొచ్చని పేర్కొంటున్నారు. కాబట్టి, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవటం ఎంతైనా అవసరమని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలితో బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదని, చిన్న చిన్న మార్పులే పెద్ద ప్రభావాన్ని చూపుతాయని వెల్లడిస్తున్నారు.

## అమెరికా 'ఆటా' మహాసభలకు రాజకీయ కార్టూనిస్టు మంగలి నారాయణకు ప్రత్యేక ఆహ్వానం



**హైదరాబాద్, జూలై 4 (వార్త సంధ్య) :** అమెరికా తెలుగు అసోసియేషన్ నిర్వహిస్తున్న 19వ ద్వైవార్షిక 'ఆటా' కాన్ఫరెన్స్ - యూత్ కన్వెన్షన్‌కు ప్రముఖ రాజకీయ కార్టూనిస్టు, సూర్యా తెలుగు దినపత్రిక కు చెందిన ఎం. నారాయణ (మంగలి నారాయణ - నారు)కు ప్రత్యేక అతిథిగా అధికారిక ఆహ్వానం అందింది. మంగలి నారాయణ రాజకీయ కార్టూనిస్టుగా తన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ ఆహ్వానం అందుకోవడం విశేషం. అమెరికాలోని బాల్టిమోర్ నగరంలోని బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో జూలై 31 నుంచి ఆగస్టు 2, 2026 వరకు ఈ మహాసభలు జరగనున్నాయి. 1990లో స్థాపించబడిన అమెరికా తెలుగు అసోసియేషన్ అమెరికాలోని 50 రాష్ట్రాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలకు సేవలందిస్తున్న ప్రముఖ లాభాపేక్షలేని సంస్థ. తెలుగు భాష, సంస్కృతి, వారసత్వ పరిరక్షణతో పాటు విద్య, ఉపాధి, సామాజిక సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ సంస్థ విశేష సేవలు అందిస్తోంది.మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో యువజన నాయకత్వ కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు, విద్యా మరియు వ్యాపార సదస్సులు, ఉద్యోగ మేళాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజాసేవ, విద్య, వ్యాపారం, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని యువతతో ముఖాముఖి చర్చలు జరపనున్నారు.మంగలి నారాయణ పాల్గొనడం తెలుగు అమెరికన్ సమాజానికి, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, కన్వీనర్ శ్రీధర్ బనాలా సంయుక్తంగా పంపిన అధికారిక ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు.

# షుగర్ పేషెంట్స్ సీతాఫలం' తినొచ్చా?

**సీతాఫలంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు - గుండె పనితీరును మెరుగుపరుస్తుందని నిపుణుల వెల్లడి!**



ప్రకృతి ప్రసాదించే అద్భుతమైన పండ్లలో సీతాఫలం ఒకటి. ఆపిల్ రంగూ, మామిడి రుచీ లేని కొండ పండు ఇది. అయితే ఎంత తిన్నా తనివి తీరని ఈ పండు ఎన్నో అనారోగ్యాల్ని నయం చేస్తుందంటున్నారు నిపుణులు. సీతాఫలంలో ఉండే ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అనేవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహకరిస్తాయని చెబుతున్నారు. మరి డయాబెటిస్?తో ఇబ్బందిపడేవారు ఈ పండ్లను తినొచ్చా? అనే వివరాలు ఇప్పుడు చూద్దాం.

**రోగనిరోధక శక్తి పెరుగుదల :** సీతాఫలంలో ఎ, సి, బి6 వంటి విటమిన్లతో పాటు కాపర్, పొటాషియం, పీచు వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా లభిస్తాయంటున్నారు నిపుణులు. ఇందులోని విటమిన్ సి అనేది రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, అనేక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుందని The Pharma Innovation Journal ప్రచురించింది. అలాగే, ఇందులోని యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు శరీరంపై ఏర్పడిన వాపును తగ్గించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు.

'గుండెకు' ముప్పు తెచ్చే అలవాట్లు ఇవే! - వీటికి దూరంగా ఉండాలంటున్న నిపుణులు

**గుండె ఆరోగ్యానికి :** సీతాఫలంలో అధిక మెగ్నీషియం కంటెంట్ మృదువైన గుండె కండరాలను సడలించి, స్ట్రోక్, గుండెపోటును నివారిస్తుందని అధ్యయనం పేర్కొంది. ఇందులోని ఫైబర్, నియాసిన్ శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**షుగర్ కంట్రోల్ :** ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల చక్కెర శోషణ నెమ్మదిగా జరుగుతుందంటున్నారు నిపుణులు. తద్వారా టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. సీతాఫలంలో గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుందని, ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్స్? డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. అయితే మరీ ఎక్కువ మొత్తంలో కాకుండా మితంగా, డాక్టర్ల సూచన మేరకు తినాలని చెబుతున్నారు.

**గర్భిణులకు :** గర్భం దాల్చిన మహిళల్లో వేవిళ్లు, మూడ్ స్వింగ్స్?, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం లాంటి సమస్యలు కామన్?. అయితే వీటిని సీతాఫలంతో చెక్ పెట్టొచ్చంటున్నారని నిపుణులు. ఇందులో కాపర్ ఎక్కువ మొత్తంలో లభిస్తుందని, దీంతో శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయంటున్నారు. అంతేకాకుండా, పిండం అభివృద్ధిలో సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. గర్భాధారణ సమయంలో సీతాఫలం తినడం వల్ల, పుట్టబోయే శిశువు మెదడు, నాడీ వ్యవస్థ, రోగనిరోధక శక్తి అభివృద్ధికి తోడ్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో గర్భిణులకు కాపర్ తక్కువైతే పూర్తిగా నెలలు నిండకుండానే బిడ్డ పుట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, వీరు సీతాఫలం తినడం మంచిదని సూచిస్తున్నారు.

**బరువు అదుపులో :** సీతాఫలంలో కొవ్వులు, క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే, ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావన కలిగేలా చేస్తుందంటున్నారు నిపుణులు. దీంతో ఎక్కువ సమయం ఆకలేయకుండా, చిరుతిండ్ల జోలికి పోకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. తద్వారా క్రమంగా బరువు తగ్గచ్చని సూచిస్తున్నారు. ఇందులో ఉండే విటమిన్ బి6 కడుపుబ్బరం, అజీర్తి, అల్సర్లు వంటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుందని పేర్కొంటున్నారు.

**పీసీఓఎస్ ఉన్నవారు :** పీసీఓఎస్ ఉన్న వారిలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా అలసట, నీరసం, మూడ్ స్వింగ్స్, చికాకు వంటివి సర్వసాధారణంగా ఉంటాయి. అయితే వీటన్నింటికీ ఐరన్ విరుగుడుగా పనిచేస్తుందని, సీతాఫలంలో అది ఎక్కువగా లభిస్తుందని అంటున్నారు నిపుణులు. కాబట్టి, పీసీఓఎస్ ఉన్న వారూ ఈ పండు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే, ఇది సంతాన సాఫల్యతను సైతం పెంచుతుందని తెలియజేస్తున్నారు.

**ఇవీ కూడా :**

ఈ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు క్యాన్సర్లు రాకుండా రక్షిస్తాయి.ఇందులో బి- కాంప్లెక్స్ అధికంగా ఉండటం వల్ల మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఒత్తిడి, ఆందోళన తగ్గించడంలో సహాయపడుతుంది.ఈ పండులో విటమిన్ రైబోఫ్లేవిన్ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్?తో పోరాడి కంటిచూపును మెరుగుపరచడంతో పాటు కంటి సమస్యల్ని నివారిస్తాయి.సీతాఫలంలో అధికంగా ఉండే డైటరీ పీచు పదార్థం జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.అయితే సీతాఫలం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది కదా అని ఎక్కువగా తినడం కూడా శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు. అలాగే వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ పండు మోతాదు విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే నిపుణుల్ని అడిగి తెలుసుకోవడం మంచిదంటున్నారు.

# ధనియాలతో నీళ్లను ఇలా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!



జశీతీఖుఅనవతీ ౫వవసం ఔ౯వతీ% ఎ ధనియాలను మనం వంటి ఇంటి మసాలా దినుసులుగా ఎప్పటినుంచో ఉపయోగిస్తున్నాం. అయితే ఆయుర్వేద ప్రకారం ఈ దినుసులు అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. పలు ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ ధనియాలను ఉపయోగిస్తారు. అలాగే మసాలా వంటకాల్లోనూ వీటిని వాడుతారు. అయితే కేవలం రుచి, వాసనను అందిండమే కాదు, మనకు ఇవి ఆరోగ్య ప్రయోజనాలను కలగజేస్తాయి. ధనియాలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలతో తయారు చేసే నీళ్లను తాగితే ఎంతో మేలు జరుగుతుందని వారు చెబుతున్నారు. ధనియాల నీళ్లను తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గిపోతాయి.

### షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్‌కు..

ధనియాల నీళ్లను తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను బాగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ధనియాల నీళ్లను తాగితే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. వీటిల్లో క్వర్సెటిన్, టెర్పినైన్, టోకోఫెరాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ధనియాల నీళ్లను తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె సురక్షితంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

### ఏ సమయంలో తాగాలి..?

బరువు తగ్గాలనుకునే వారు, లివర్ వ్యాధులు ఉన్నవారు, చర్మ సమస్యలకు కూడా ధనియాల నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మోకాళ్లు, కీళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ధనియాల నీళ్లను తాగితే మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా మారుతారు. నీరసం, అలసట తగ్గిపోతాయి. ధనియాల నీళ్లను రోజూ ఉదయం పరగడుపునే తాగవచ్చు. లేదా భోజనం చేయడానికి 45 నిమిషాల ముందు తాగాలని ఆయుర్వేదం చెబుతోంది. ధనియాలను రాత్రి పూట నీటిలో నానబెడితే మరుసటి రోజు మొత్తం ఆ నీళ్లను కొద్ది కొద్దిగా కూడా తాగుతూ ఉండవచ్చు.

### ఇలా కూడా చేయవచ్చు..

ఇక ధనియాల నీళ్లను కేవలం ధనియాలను నానబెట్టి మాత్రమే కాదు, ధనియాలను నీటిలో వేసి మరిగించి కూడా తయారు చేయవచ్చు. ఇలా ఏ రకంగా అయినా సరే ధనియాల నీళ్లను తయారు చేసి తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలు అనేక వ్యాధులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయని అంటున్నారు. అలర్జీలు ఉన్నవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు ధనియాల నీళ్లను తాగకూడదు.

# రోజూ దీన్ని 2 కప్పులు తాగితే చాలు.. చెప్పలేనన్ని లాభాలు కలుగుతాయి..!



రోజూ ఉదయం నిద్ర లేచిన దగ్గరి నుంచి రాత్రి మళ్లీ నిద్రించే వరకు చాలా మంది టీ, కాఫీలను అధికంగా తాగుతుంటారు. వాతావరణం చల్లగా ఉంటే టీ, కాఫీలు ఇంకా ఎక్కువగా తాగుతారు. అయితే టీ, కాఫీలకు బదులుగా హెర్బల్ టీలను తాగితే ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని, దీంతోపాటు టీ, కాఫీ తాగిన ఫీలింగ్ కూడా కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. ఈ క్రమంలోనే మనకు తాగేందుకు అనేక రకాల హెర్బల్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కొంబుచా టీ కూడా ఒకటి. టీ, చక్కెర, బ్యాక్టీరియా, ఈస్ట్‌ను కలిపి పులియబెట్టి ఈ టీ పొడిని తయారు చేస్తారు. దీన్నే కొంబుచా టీ అంటారు. ఇది అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొంబుచా టీని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని వారు అంటున్నారు.

### జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

కొంబుచా టీ అంటే పులియబెట్టబడింది కనుక ఈ టీని సేవిస్తే ప్రోబయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. అంటే ఈ టీ మన జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అజీర్తి తగ్గుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మలబద్దకం తగ్గిపోతుంది. విరేచనాలు, ఇరిటబుల్ బౌల్ సింద్రోమ్ (ఐబీఎస్) వంటి సమస్యలు ఉన్నవారు కొంబుచా టీని సేవిస్తుంటే ఉపశమనం లభిస్తుంది. కొంబుచా టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండడం వల్ల ఈ టీని సేవిస్తుంటే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, వయస్సు మీద పడడం వల్ల వచ్చే జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చు.

### లివర్ ఆరోగ్యానికి..

కొంబుచా టీ లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం రోజూ ఈ టీని తాగుతుంటే అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్ కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో లివర్‌లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. లివర్ క్లీన్ అవుతుంది. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గుతుంది. లివర్ సంబంధిత వ్యాధులు ఉన్నవారికి ఈ టీ ఎంతగానో మేలు చేస్తుంది. ముఖ్యంగా మద్యం కారణంగా వచ్చిన ఫ్యాటీ లివర్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొంబుచా టీని తాగితే మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

### డయాబెటిస్ ఉంటే..

ఈ టీని తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గిపోతాయి. కొంబుచా టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కొంబుచా టీని తాగడం వల్ల శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ టీ బరువును కూడా తగ్గించగలదు. దీన్ని తాగితే శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు త్వరగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు ఈ టీని డైట్‌లో కచ్చితంగా చేర్చుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇలా కొంబుచా టీని రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# మరణించిన వ్యక్తి ఆస్తులను “వారసులు” తెలుసుకోవడం ఎలా

**ద్వారా ఈజీ అంటున్న నిపుణులు!**

**చనిపోయిన వ్యక్తి పేరిట ‘పెట్టుబడులు’ ఉన్నాయా**

**- అవి ఎలా గుర్తించాలో తెలియడం లేదా**



కుటుంబ సభ్యుడి ఆకస్మిక మరణాన్ని తట్టుకోవడం చాలా కష్టం. ఫ్యామిలీలో ఒకరు శాశ్వతంగా దూరమవడం అనేది ఎవరూ ఊహించలేని మానసిక వేదనను మిగులుస్తుంది. ఇక అదే వ్యక్తి కుటుంబానికి ఆధారమైతే ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా సంపాదించే వ్యక్తి తన ఫ్యామిలీ మెంబర్స్‌కు పొదుపు, పెట్టుబడులు వంటి విషయాల గురించి సమాచారం ఇవ్వకపోతే, ఇలాంటి బాధాకరమైన టైమ్‌లో ఆ ఆర్థిక విషయాల గురించి తెలుసుకోవడం పెద్ద సవాల్‌గా మారుతుంది. ఇంతకీ, మరణించిన వ్యక్తి పేరిట ఉన్న పెట్టుబడులు, ఇతర ఆస్తులను ఎలా గుర్తించాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం.మరణించిన వ్యక్తి వివిధ మ్యూచువల్ ఫండ్లు, విభిన్న డీమ్యాట్ అకౌంట్లలో ఇన్వెస్ట్‌మెంట్ చేసి ఉంటే, ఆ వివరాలన్నీ గుర్తించడం కష్టంగా మారుతుంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చట్టబద్ధమైన వారసులకు “కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్ (సీఏఎస్)” ఒక మంచి పరిష్కారంగా ఉపయోగపడు తుందంటున్నారు ఆర్థిక నిపుణులు. అసలేంటి, ఈ సీఏఎస్, దీని ద్వారా సులభంగా మరణించిన వ్యక్తి ఆర్థిక ఆస్తులు, పెట్టుబడులను గుర్తించవచ్చో ఇప్పుడు చూద్దాం.సీఏఎస్ అంటే ఏమిటనగా, పెట్టుబడిదారుడి పాన్ కార్డు నంబర్ ఆధారంగా వారి పెట్టుబడులన్నింటినీ ఒకే చోట చూపించే ఏకీకృత పత్రం. చనిపోయిన వ్యక్తి పేరిట వివిధ వేదికల్లో ఉన్న ఆర్థిక ఆస్తులు, పెట్టుబడులను గుర్తించి వాటిని క్లెయిం చేసుకోవడానికి వారసులకు ఈ సీఏఎస్ చాలా బాగా ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.ఈ పత్రం డిపాజిటరీలు, మ్యూచువల్ ఫండ్ సంస్థల పరిధిలో ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న ఇన్వెస్ట్‌మెంట్స్ అన్నింటినీ ఒకచోట మనకు అందిస్తుంది. పెట్టుబడిదారుడు పాన్‌కు లింక్ అయి ఉన్నందున, దాదాపు అన్ని పెట్టుబడుల వివరాలు ఇందులో కనిపిస్తాయంటున్నారు. డీమ్యాట్ అకౌంట్లలో ఉన్న సెక్యూరిటీలు, మ్యూచువల్ ఫండ్లు, కొన్నిరకాల బాండ్ వివరాలను సీఏఎస్ ఏకీకృతం చేస్తుంది. కాబట్టి, దీనిద్వారా మరణించిన వ్యక్తికి సంబంధించిన ఆర్థిక ఆస్తుల వివరాలను వారి వారసులు ఈజీగా తెలుసుకోవడానికి వీలు ఉంటుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా సీఏఎస్ ద్వారా వివిధ మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో ఉన్న పెట్టుబడులన్నీ ఈజీగా గుర్తించవచ్చు.అలాగే, పెట్టుబడిదారుడు కొనుగోలు చేసిన ఈక్విటీ షేర్లు, మార్కెట్ అనుసంధాన ఆస్తులను దీనిద్వారా తెలుసుకోవచ్చు.సీఏఎస్ ఈ విషయాలు తెలుసుకోవడానికి మాత్రమే కాదు ఆస్తుల యాజమాన్యాన్ని, తాజా పెట్టుబడి కార్యకలాపాలను ధ్రువీకరించుకోవడానికి చాలా బాగా యూజ్ అవుతుంది. ఇందులో వివిధ సంస్థల వద్ద ఉన్న ఆస్తుల కంప్లీట్ డీటెయిల్స్ ఒకే చోట చూసే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### కొత్తగా జాబ్‌లో చేరారా - మీ ఆర్థిక ప్రణాళిక ఇలా ఉంటే అప్పులకు “నో” ఛాన్స్!

మరణించిన వ్యక్తి పెట్టుబడులను సురక్షితంగా గుర్తించి, తమ పేరిట బదిలీ చేసుకోవడానికి వారసులు ఏం చేయాలో ఇప్పుడు చూద్దాం.ముందుగా మరణించిన వ్యక్తి ఇ-మెయిల్స్‌ను చెక్ చేయాలి. అందులో సీఏఎస్, చీూఖా సీఏఎస్, సీడీఎస్‌ఎల్ సీఏఎస్ లేదా కన్సాలిడేట్ అకౌంట్ స్టేట్‌మెంట్ వంటి కీలక పదాలతో సెర్చ్ చేయాలి. దీనిద్వారా చనిపోయిన వ్యక్తి పెట్టుబడి పోర్ట్‌ఫోలియోకు సంబంధించిన డీటెయిల్స్ కనుక్కోవచ్చుంటున్నారు నిపుణులు. నార్మల్‌గా ఈ డాక్యుమెంట్లు పాస్‌వర్డ్ రక్షణతో ఉంటాయి. సదరు పెట్టుబడిదారుడి పాన్ కార్డు నంబరును పెద్ద అక్షరాల్లో నమోదు చేయడం ద్వారా పీడీఎఫ్ ఫైల్‌ను చూడొచ్చు. అది ఓపెన్ అయ్యాక అందులోని మ్యూచువల్ ఫండ్లు, ఈక్విటీ షేర్లు, బాండ్లు, డీమ్యాట్ రూపంలో ఉన్న ఇతర సెక్యూరిటీలను జాగ్రత్తగా పరిశీలించాలి.నెక్స్ట్ గుర్తించిన ఇన్వెస్ట్‌మెంట్స్ ఆధారంగా సంబంధిత డిపాజిటరీని కానీ, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) లేదా రిజిస్ట్రార్‌ను సంప్రదించాలి వారసులు. అప్పుడు వారసుల పేరిట ఆయా పెట్టుబడులను బదిలీ చేయడానికి వారు తగిన సహాయం చేస్తారంటున్నారు నిపుణులు.వారసుల పేరిట ఆస్తులను మార్చేందుకు అవసరమైన డాక్యుమెంట్స్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అందులో భాగంగా చనిపోయిన వ్యక్తి పాన్, ఆధార్ డీటెయిల్స్, డెత్ సర్టిఫికేట్, చట్టబద్ధమైన వారసత్వ ధ్రువీకరణ పత్రం, వారసుల గుర్తింపు కార్డులను సబ్మిట్ చేసి, ఆస్తుల బదిలీ ప్రక్రియను కంప్లీట్ చేయాలి.కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్ (సీఏఎస్)లో ఎలక్ట్రానిక్ పెట్టుబడులు మాత్రమే కనిపిస్తాయని గుర్తుంచుకోవాలి. భౌతిక రూపంలో ఉన్న షేర్ సర్టిఫికెట్ల వివరాలు ఇందులో కనిపించవు. కాబట్టి, సంప్రదాయ సేవింగ్ స్కీమ్స్ అయిన బ్యాంక్ డిపాజిట్లు, పీపీఎఫ్, పోస్టాఫీసు పెట్టుబడుల డీటెయిల్స్ ఇందులో ఉండవని గమనించాలి.


# ఆ చైనా యాప్‌లను తొలగించండి

**ఈ-రిక్షాల నిలిపివేతపై కేంద్రం సీరియస్!**

**ఈ-రిక్షా యాప్‌లపై కేంద్రం చర్యలు , రెండు చైనా యాప్‌ల తొలగింపు ఆదేశం**

**బ్లూటూత్‌తో వాహనాలు నిలిచిపోతున్న వైనం , భద్రతా లోపాలే ప్రధాన కారణం**

**ప్లే స్టోర్, యాప్ స్టోర్‌కు ఆదేశాలు**




ఈ-రిక్షాలను దూరం నుంచే నిలిపివేయడానికి ఉపయోగిస్తున్న ‘దీూు దీమీ’, ‘జుజూశీఫ్ష్ర ాాఅ-అశీఅ’ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ యాప్‌ల దుర్వినియోగంపై వచ్చిన నివేదికల తర్వాత ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.ఈ రెండు యాప్‌లు బ్లూటూత్ ద్వారా లిథియం-అయాన్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు కనెక్ట్ అవుతాయి. బ్యాటరీ పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించినప్పటికీ కొందరు వీటిని ఈ-రిక్షాల పవర్‌ను దూరం నుంచే నిలిపివేయడానికి ఉపయోగిస్తున్నారు. యాప్‌లోని డిశ్చార్జ్ స్విచ్ నొక్కగానే వాహనం ఒక్కసారిగా ఆగిపోతోంది.చాలా ఈ-రిక్షాల్లో ఉపయోగించే బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లలో పాస్‌వర్డ్, ఇతర భద్రతా ధ్రువీకరణ లేకపోవడమే ఈ సమస్యకు కారణమని అధికారులు తెలిపారు. దీంతో సమీపంలో ఉన్న ఎవరైనా బ్లూటూత్ ద్వారా కనెక్ట్ అయి వాహనాన్ని నిలిపివేయగలుగుతున్నారు. తిరిగి అదే యాప్ ద్వారా ఆన్ చేస్తేనే వాహనం మళ్లీ పనిచేస్తోంది.ఇలాంటి ప్రమాదకర యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉండకుండా చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. భవిష్యత్తులో కూడా ప్రజల భద్రతకు ముప్పుగా మారే యాప్‌లను గుర్తించి యాప్ స్టోర్ల నుంచి తొలగించే చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

# పీఎఫ్ ఖాతాల్లో రూ.9,330 కోట్లు.. ఆ డబ్బు మాది అని అడిగేవారే లేరు!

**నిరుపయోగంగా 31 లక్షల ఈపీఎఫ్ ఖాతాలు**

**అందులో మూలుగుతున్న రూ.9,330 కోట్ల కార్మికుల సొమ్ము**

**‘ఇండియా టుడే’ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైన నిజాలు**

**కొత్త ఈపీఎఫ్ స్కీమ్ 2026 వచ్చినా తీరని పాత సమస్య**

**ఈ నిధులతో మూడు కొత్త ఐఐటీలు నిర్మించవచ్చని అంచనా**

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారుల కోసం సరికొత్త ‘ఈపీఎఫ్ స్కీమ్-2026’ను నోటిఫై చేసి డిజిటల్ యుగానికి శ్రీకారం చుట్టింది. అయితే, మరోవైపు దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల నిరుపయోగ ఈపీఎఫ్ ఖాతాల్లో దాదాపు రూ.9,330 కోట్లకు పైగా కార్మికుల సొమ్ము క్లెయిమ్ చేయకుండా మూలుగుతోందన్న సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ‘ఇండియా టుడే’ ప్రత్యేకంగా సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం ద్వారా పొందిన ఈ వివరాలు బయటకు వచ్చాయి.1952 నాటి పాత పథకం స్థానంలో జూన్ 29 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఈపీఎఫ్ స్కీమ్-2026, నిబంధనలను సరళతరం చేయడం, వ్యవస్థను డిజిటలైజ్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మంది యాక్టివ్ చందాదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సంస్కరణల నేపథ్యంలో కార్మికుల పదవీ విరమణ పొదుపు ఎంత పెద్ద మొత్తంలో వారికి చేరకుండా నిలిచిపోయిందో ఆర్టీఐ గణాంకాలు కళ్లకు కడుతున్నాయి.ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) అందించిన సమాచారం ప్రకారం.. 2026 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 30,91,862 నిరుపయోగ ఖాతాలు ఉన్నాయి. వీటిలో సుమారు రూ.9,330 కోట్లు క్లెయిమ్ చేయని నిల్వలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పరిస్థితి స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, సమస్య తీవ్రత మాత్రం తగ్గలేదు. 2025 మార్చి 31 నాటికి 31.83 లక్షల ఖాతాల్లో రూ.10,181 కోట్లు ఉండగా, ఏడాది వ్యవధిలో నిరుపయోగ ఖాతాల సంఖ్య 92,000, క్లెయిమ్ చేయని మొత్తం రూ.851 కోట్లు తగ్గింది. అయితే, ఇప్పటికీ దాదాపు 31 లక్షల ఖాతాలు నిద్రాణంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం.

### రూ.9,330 కోట్లతో ఏం చేయవచ్చు

ఈపీఎఫ్ ఖాతాల్లో మూలుగుతున్న ఈ భారీ మొత్తం ఎంత పెద్దదో అర్థం చేసుకోవాలంటే కొన్ని ప్రభుత్వ పథకాలతో పోల్చి చూడాలి.2016లో ప్రారంభించిన ప్రాంతీయ కనెక్టివిటీ పథకం ‘ఉడాన్’ కోసం కేంద్రం ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ.10,169 కోట్లతో ఈ మొత్తం దాదాపు సమానం. కేంద్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేపీవై)కు కేటాయించిన నిధులకు ఇది దాదాపు సమానం.2014 ప్రభుత్వ అంచనా ప్రకారం ఒక ఐఐటీని ఏర్పాటు చేయడానికి రూ.1,750 కోట్లు ఖర్చవుతుంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2026 నాటికి దీని విలువ రూ.2,934 కోట్లు. అంటే, ఈపీఎఫ్ ఖాతాల్లోని డబ్బుతో మూడు కొత్త ఐఐటీలను నిర్మించి, ఇంకా రూ.500 కోట్లకు పైగా మిగుల్చుకోవచ్చు. ఈ పోలిక కేవలం ఉదాహరణ మాత్రమే అయినప్పటికీ, కార్మికుల సొమ్ము ఎంత భారీ స్థాయిలో నిలిచిపోయిందో స్పష్టం చేస్తోంది.

### సమాచారం ఇవ్వని ఈపీఎఫ్ఓ

గత ఐదేళ్లుగా నిరుపయోగ ఖాతాల సంఖ్య, వాటిలోని మొత్తం వివరాలను ‘ఇండియా టుడే’ ఆర్టీఐ ద్వారా కోరింది. అయితే, ఈపీఎఫ్ఓ కేవలం 2025, 2026 సంవత్సరాల సమాచారాన్ని మాత్రమే అందించగలమని తెలిపింది. 2025-26లోనే ‘ఇనాపరేటివ్ అకౌంట్స్ సెల్’ (ఐఏసీ)ను ఏర్పాటు చేశామని, అంతకుముందు సంవత్సరాల సమాచారం తమ వద్ద లేదని పేర్కొంది.అంతేగాక, ఆధార్‌తో అనుసంధానమైన నిరుపయోగ ఖాతాలు, వాటిలోని మొత్తం, ఆటో-సెటిల్‌మెంట్ స్థితి వంటి వివరాలను వెల్లడించడానికి ఈపీఎఫ్ఓ నిరాకరించింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఇ) ప్రకారం, విశ్వసనీయ సంబంధం కింద ఉన్న సమాచారాన్ని బహిర్గతం చేయలేమని తెలిపింది. రూ.5 లక్షలకు పైగా బ్యాలెన్స్ ఉన్న నిరుపయోగ ఖాతాల వివరాలు కోరగా, ఆ ఫార్మాట్‌లో డేటా నిర్వహించడం లేదని బదులిచ్చింది.మొత్తం మీద కొత్త సంస్కరణలు అమలు చేస్తున్నప్పటికీ, కార్మికుల కష్టార్జితం వారికి చేరడంలో దశాబ్దాలుగా ఉన్న సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఐటీ, ఫార్మా షేర్ల జోరు.. లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**

**ఐటీ, రియల్టీ, ఫార్మా రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు**

**మిశ్రమంగా స్పందించిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు**

**గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాలు కలిసొచ్చిన వైనం**

**పీఎస్‌యూ బ్యాంక్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు లాభాలతో ముగిశాయి. ఐటీ, రియల్టీ, ఫార్మా రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో పయనించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 262.79 పాయింట్లు (0.34శాతం) లాభపడి 77,763.91 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ 95.15 పాయింట్లు (0.39శాతం) పెరిగి 24,270.85 వద్ద నిలిచింది. నిఫ్టీలో హెచ్‌సీఎల్‌టెక్, మ్యాక్స్ హెల్త్‌కేర్, అపోలో హాస్పిటల్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ సూచీ అత్యధికంగా రాణించగా, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్ సూచీలు కూడా లాభాల్లో ట్రేడ్ అయ్యాయి.అయితే, నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.19 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.04 శాతం స్వల్పంగా పెరిగింది. మరోవైపు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయి మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది.అమెరికా కార్మిక మార్కెట్ డేటా సానుకూలంగా రావడం, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉందన్న అంచనాలతో గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయని విశ్లేషకులు తెలిపారు.

# అమెజాన్ / ఫ్లిప్‌కార్ట్ సేల్స్

**వీటిపై అదిరిపోయే ఆఫర్స్, డిస్కౌంట్స్**

**ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్ ఎం అమెజాన్ ప్రైమ్ డే**

**ఆఫర్స్ ఫుల్ కంపారిజన్ మీ కోసం!**

షాపింగ్ ప్రియులకు గుడ్ న్యూస్. దేశంలోని రెండు అతిపెద్ద ఈ-కామర్స్ కంపెనీలు అయిన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ భారీ ఆఫర్స్, డిస్కౌంట్స్, డీల్స్‌తో సేల్ ప్రకటించాయి. అమెజాన్ ప్రైమ్ డే సేల్స్ జులై 4 నుంచి ప్రారంభమై జులై 6 వరకు కొనసాగనుండగా, ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్ జులై 4 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఫ్లిప్‌కార్టు ప్లస్, బ్లాక్ మెంబర్స్‌కు అయితే 24 గంట ముందే ఎర్లీ యాక్సెస్ లభించనుంది. అంటే జులై 3వ తేదీ ఉదయం 12 గంటలకే ఈ సేల్ ప్రారంభం కానుంది. మరెందుకు ఆలస్యం ఈ రెండు ప్లాట్‌ఫామ్స్‌లో లభిస్తున్న బెస్ట్ డీల్స్, ఆఫర్స్, డిస్కౌంట్స్‌పై ఓ లుక్కేద్దాం రండి.

### అమెజాన్ ప్రైమ్ డే సేల్

భారత్‌లో అమెజాన్ 10వ ప్రైమ్ డే ఎడిషన్ ఇది. అందుకే ఇందులో ప్రైమ్ మెంబర్స్‌కు అదిరిపోయే ఆఫర్స్ అందించనున్నట్లు ప్రకటించింది. 300 టాప్ బ్రాండ్స్, 500 సరికొత్త ప్రొడక్టులతో పాటు, 15,000 ప్రొడక్టులపై భారీ తగ్గింపు ధరకు అందించనున్నట్లు తెలిపింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ సేల్ కేవలం అమెరిజా ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్నవాళ్లకు మాత్రమే. అందువల్ల సాధారణ ఖాతాదారులు ఈ ఆఫర్స్ పొందలేరు. అయితే మీ బంధువులు లేదా స్నేహితులు ఎవరికైనా ప్రైమ్ మెంబర్‌షిప్ ఉంటే, వాళ్ల ఖాతాను ఉపయోగించి మీరు కూడా ఈ అదిరిపోయే ఆఫర్స్‌ను సొంతం చేసుకోవచ్చు. లేదంటే మీరే స్వయంగా అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవచ్చు. ఇలా కొత్తగా ప్రైమ్ మెంబర్‌షిప్ తీసుకున్నవాళ్లకు అమెజాన్ తాజా సేల్‌లో స్పెషల్ డిస్కౌంట్స్ అందించనుంది.ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ సంవత్సర చందా రూ.1499. అయితే దీనిపై ఏకంగా రూ .500 తగ్గించి ఇప్పుడు కేవలం రూ.999లకే అందిస్తున్నారు. ప్రైమ్ లైట్ ధర రూ.999. దీనిపై రూ.200 వరకు తగ్గించి రూ.599లకే ఇస్తున్నారు. ఇవి వద్దు కేవలం షాపింగ్ చేసినందుకు డిస్కౌంట్స్ కావాలని అనుకునేవారు



‘ప్రైమ్ షాపింగ్ ఎడిషన్’ను తీసుకోవచ్చు. దీని ధర రూ.399 అయినప్పటికీ రూ.100 తగ్గింపుతో కేవలం రూ.299లకే అందిస్తున్నారు. ఈ అమెజాన్ ప్రైమ్ మెంబర్‌షిప్ తీసుకుంటే మీకు కేవలం షాపింగ్ బెనిఫిట్స్, ఫాస్ట్ డెలివరీ మాత్రమే కాదు ప్రైమ్ వీడియో, ప్రైమ్ మ్యూజిక్ కూడా లభిస్తాయి.

### అమెజాన్ స్మార్ట్‌ఫోన్ డీల్స్

ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకులకు చెందిన డెబిట్, క్రెడిట్ కార్డులు వాడి వస్తువులు కొంటే ఇన్‌స్టాంట్‌గా 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్నారు. ఈఎంఐ ట్రాన్సాక్షన్స్‌కు కూడా ఈ డిస్కౌంట్ లభిస్తుంది. అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు యూజర్లకు 5 శాతం అన్‌లిమిటెడ్ క్యాష్‌బ్యాక్ అందిస్తారు. మరెందుకు ఆలస్యం ఆమెజాన్ ప్రైమ్ డే సేల్‌లో మొబైల్ ఫోన్లపై లభిస్తున్న బెస్ట్ డీల్స్ గురించి తెలుసుకుందాం రండి. శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రా : ఈ ఫోన్‌పై ఏకంగా రూ.15వేలు డిస్కౌంట్ ఇస్తున్నారు. అందువల్ల ఈ సేల్‌లో దీనిని రూ.84,999కే సొంతం చేసుకోవచ్చు. అంతేకాదు దీనిని నో-కాస్ట్ ఈఎంఐ (వడ్డీ లేని వాయిదాల పద్ధతి)లో కూడా తీసుకోవచ్చు.వన్‌ప్లస్ 13 : ఈ ప్రైమ్ సేల్ ఇది కేవలం రూ.49,999లకే లభిస్తోంది.వన్‌ప్లస్ 15ఆర్ : ఈ ప్రైమ్ సేల్ దీనిని కేవలం రూ.48,999లకే సొంతం చేసుకోవచ్చు.వన్‌ప్లస్ ఎన్6 : ఇటీవలే లాంఛ్ అయిన ఈ స్మార్ట్‌ఫోన్‌ను కేవలం రూ.19,999లకే అందుబాటులోకి తెచ్చారు.వీటితోపాటు ఐఫోన్ 17 సిరీస్‌పై కూడా మంచి ఆఫర్లు, డిస్కౌంట్లు అందిస్తున్నారు. అంతేకాదు సేల్ సమయంలో శాంసంగ్ గెలాక్సీ ఎం47 లాంటి కొత్త స్మార్ట్‌ఫోన్లు కూడా విడుదల కానున్నాయి. ఇక ఫోన్లతోపాటు వాటి యాక్సెసరీలపై 40 శాతం వరకు తగ్గింపులు, రూ.66వేల వరకు ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, 12 నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ సదుపాయాలు అందిస్తున్నారు.

### ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్ ఆఫర్స్

ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు క్రెడిట్ కార్డులపై 10 శాతం డిస్కౌంట్ ఇస్తారు. ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై ఎక్స్‌ట్రా క్యాష్‌బ్యాక్ ఇస్తారు. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ మెంబర్‌షిప్ తీసుకున్న వాళ్లకు, ప్రతికొనుగోలుపై సూపర్ కాయిన్స్ లభిస్తాయి. మరెందుకు ఆలస్యం ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ స్మార్ట్‌ఫోన్స్‌పై అందిస్తున్న బెస్ట్ డీల్స్‌పై ఓ లుక్కేద్దాం రండి.శాంసంగ్ గెలాక్సీ ఎస్25: ఆఫర్స్ అన్నీ ఉపయోగించుకుంటే ఈ ఫోన్‌ను మీరు కేవలం రూ.56,999కే సొంతం చేసుకోవచ్చు. పైగా దీనికి ఈఎంఐ ఆప్షన్ కూడా ఉంది. నెలకు రూ.9,499 చొప్పున చెల్లిస్తూ కూడా ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చు.శాంసంగ్ గెలాక్సీ ఎస్25 ఎఫ్ఈ : ఈ ఫోన్‌ను ఆఫర్‌లో రూ.47,999లకు కొనుగోలు చేయవచ్చు. దీనిని రూ.7,999 నెలవారీ ఈఎంఐ ఆప్షన్‌తో సొంతం చేసుకోవచ్చు.ఐఫోన్ 17 : ఈ గోట్ సేల్‌లో ఇది కేవలం రూ.70,900కే లభిస్తోంది. ఎక్స్ఛేంజ్ ఆఫర్ వాడుకుంటే మరో రూ.1000 దీనిపై తగ్గుతుంది.ఐఫోన్ 17ఈ : ఆఫర్లు అన్నీ వాడుకొని దీనిని రూ.60,900కు కొనుగోలు చేయవచ్చు.ఐఫోన్ 17ప్రో : ఐఫోన్ లవర్స్ ఈ ప్రో మోడల్‌ను రూ.1,12,900లకే అందుబాటులో ఉంది.ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ : ఈ సేల్‌లో ఇది రూ.1,27,900కు లభిస్తుంది.ఐఫోన్ 16 : ఇది రూ.59,900కు అందుబాటులో ఉంటుంది.ఐఫోన్ 16ఈ: దీని ధర రూ.55,900గా ఉంది.ఐఫోన్ 15 : దీని ధర రూ.49,900తో స్టార్ట్ అవుతుంది. గూగుల్ పిక్సెల్ 10ఏ : ఈ గోట్ సేల్‌లో దీనిని రూ.45,999కే అందుబాటులోకి తెచ్చారు. దీనిని నెలకు రూ.7,667 చెల్లిస్తూ ఈఎంఐ ప్లాన్‌తో కూడా కొనుగోలు చేయవచ్చు.గూగుల్ పిక్సెల్ 10 : దీనిని రూ.64,999కే అందుబాటులోకి తెచ్చారు. ఈఎంఐ ఆప్షన్ కూడా దీనికి ఉంది.గూగుల్ పిక్సెల్ 10 ప్రో ఎక్స్‌ఎల్ : దీని ప్రారంభ ధర రూ.1,14,999. దీనిని కూడా ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు చేయవచ్చు. నథింగ్ ఫోన్ (4ఏ) ప్రో : దీనిని స్పెషల్ ఆఫర్ కింద రూ.41,999కే పొందవచ్చు. నెలకు రూ.4,666 చెల్లిస్తూ ఈఎంఐ పద్ధతిలోనూ దీనిని కొనుగోలు చేయవచ్చు.

# 90 స్పీడ్.. 160 కి.మీ రేంజ్.. రివోల్ట్ కొత్త ఈ-బైక్

**ప్రారంభ ధర రూ.1.24 లక్షలు , ఒక్క ఛార్జ్‌తో 160 కి.మీ రేంజ్**

**80 నిమిషాల్లో 80% ఛార్జ్ , బూస్ట్ మోడ్ ప్రత్యేక ఆకర్షణ**




ఎలక్ట్రిక్ బైక్ మార్కెట్‌లో రోజురోజుకూ పోటీ పెరుగుతోంది. కొత్త మోడల్‌తో రివోల్ట్ మోటార్స్ కూడా రంగంలోకి దిగింది. పెర్ఫార్మెన్స్‌తో పాటు అధునాతన ఫీచర్లను కోరుకునే యువతను లక్ష్యంగా చేసుకొని ఈ బైక్‌ను తీసుకొచ్చింది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 160 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ చెబుతోంది.రివోల్ట్ మోటార్స్ కొత్త ఆర్‌వీఎక్స్ ప్రారంభ ధర రూ.1.30 లక్షలు (ఎక్స్‌షోరూమ్). అయితే పీఎం ఈ-డ్రైవ్ ప్రోత్సాహకాలతో కలిపితే ధర రూ.1.24 లక్షలకు తగ్గుతుంది. కంపెనీ మోడల్ లైనప్‌లో ఇది ఆర్‌వీ బ్లేజ్‌ఎక్స్ కంటే పైస్థానంలో, ఆర్‌వీ400 కంటే దిగువన ఉంటుంది.ఈ బైక్‌లో 4 కిలోవాట్ల పీఎంఎస్‌ఎం మిడ్-డ్రైవ్ మోటార్ ఇచ్చారు. గరిష్ఠంగా 5.3 కిలోవాట్ల పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. వెనుక చక్రానికి 230ఎన్‌ఎం టార్క్ అందిస్తుంది. దీంతో 0 నుంచి 40 కి.మీ వేగాన్ని కేవలం 3.9 సెకన్లలో అందుకుంటుంది. బూస్ట్ మోడ్‌లో గరిష్ఠ వేగం గంటకు 90 కి.మీ. 3.24 ఎఔష్త్ర తొలగించగలిగే ఎన్‌ఎంసీ బ్యాటరీతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 160 కి.మీ వరకు ప్రయాణించవచ్చు. ఫాస్ట్ ఛార్జర్‌తో 80 నిమిషాల్లో 0 నుంచి 80 శాతం వరకు ఛార్జ్ అవుతుంది.ఈ బైక్‌లో ఎకో, నార్మల్, స్పోర్ట్ రైడింగ్ మోడ్‌లతో పాటు అదనంగా బూస్ట్ మోడ్ కూడా ఉంది. ముందు భాగంలో యూఎస్‌డీ ఫోర్క్, వెనుక మోనోషాక్ సస్పెన్షన్, రెండు చక్రాలకు డిస్క్ బ్రేక్‌లున్నాయి. 3.5 అంగుళాల ఖ్రా67 రేటెడ్ డిస్‌ప్లే, బ్లూటూత్ కనెక్టివిటీ, టెలిమాటిక్స్, ఓటీఏ అప్‌డేట్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.జియో ఫెన్సింగ్, కాల్, మెసేజ్ అలర్ట్స్, హిల్ హోల్డ్ అసిస్ట్, రివర్స్ మోడ్, వాక్ అసిస్ట్, ఇమ్మొబిలైజర్, వెహికల్ లొకేటర్ వంటి స్మార్ట్ ఫీచర్లను కంపెనీ అందించింది.

# బేబీ బంప్‌తో వర్కౌట్ చేస్తున్న సమంత



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తాజా ఫోటో డంప్‌లో వర్కౌట్ చేస్తున్న వీడియో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా వీడియోలో ఆమె లుక్‌పై నెట్టింట విస్తృతంగా చర్చ జరుగుతోంది.తాజా వీడియోలో సమంత జిమ్‌లో అప్పర్ బాడీ వ్యాయామాలు చేస్తూ కనిపించింది. ఫిట్‌నెస్‌కు ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే సమంత, కఠినమైన వ్యాయామాలను ఎంతో నిబద్ధతతో పూర్తి చేస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ప్రతి సెట్ అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ మళ్లీ వ్యాయామం కొనసాగించింది. అయితే, ఈ వీడియో నేపథ్యంలో సోషల్ మీడియాలో సమంత వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక ఊహాగానాలు కూడా వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉన్నారనే ప్రచారం కొద్ది రోజులుగా జరుగుతూ రాగా, దీనిపై సామ్ క్లారిటీ ఇచ్చింది. ఇటీవల మా ఇంటి బంగారం సక్సెస్ మీట్‌లో తాను ప్రెగ్నెంట్ చెప్పుకొచ్చింది. అయితే ఫిట్‌నెస్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, గర్భధారణ సమయంలో వ్యాయామం చేయాలనుకునే వారు తప్పనిసరిగా వైద్యుల సూచనలు, పర్యవేక్షణలోనే తగిన వ్యాయామాలు చేయాలి. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి భిన్నంగా ఉండటంతో, ఒకరికి అనుకూలమైన వ్యాయామం మరొకరికి సరిపోవాల్సిన అవసరం లేదు. మరోవైపు, సమంత తన కెరీర్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ కొత్త అడుగులు వేస్తూ విభిన్న కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫిట్‌నెస్ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.

# 'బ్లాస్ట్' దర్శకుడితో సినిమా?



తమిళ యాక్షన్ థ్రిల్లర్ 'బ్లాస్ట్' చిత్రంతో తొలి ప్రయత్నంలోనే టాలెంటెడ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు సుభాష్ కె రాజ్. అర్జున్, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం ఓటీటీలో సైతం ఆదరణ చూరగొంటున్నది. దర్శకుడు సుభాష్ కె రాజ్ ఎంచుకున్న కాన్సెప్ట్, మేకింగ్‌స్టైల్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ యువ దర్శకుడితో హీరో నాని ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలావుండగా నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్' షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత ఆయన సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే.



# సుకుమార్ - దేవిశ్రీ ప్రసాద్ కాంబోకి బ్రేక్.. రామ్ చరణ్ సినిమా నుండి డీఎస్పీ ఔట్?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రేజీ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రూపుదిద్దుకోబోతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం చ=జ17 మ్యూజిక్ డైరెక్టర్ మార్పుకు సంబంధించి ఇండస్ట్రీలో ఒక సంచలన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్ నుండి సుకుమార్ ఆస్థాన సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ తప్పుకున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'రంగస్థలం' తర్వాత రాబోతున్న సినిమా కావడంతో, దేవిశ్రీ ఈ ప్రాజెక్ట్‌లో లేరనే ప్రచారం మెగా అభిమానులతో పాటు సినీ ప్రియులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ షాకింగ్ మార్పు వెనుక ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' చిత్రం సమయంలో తలెత్తిన కొన్ని క్రియేటివ్ డిఫరెన్సెస్ ఉన్నట్లు తెలుస్తోంది. పుష్ప 2 బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (బీ+వీ) మరియు రీ-రికార్డింగ్ పనులలో అనుకున్న సమయానికి అవుట్‌పుట్ రాకపోవడం, ఆ కారణంగా ఇతర మ్యూజిక్ డైరెక్టర్ల సేవలను సుకుమార్ ఉపయోగించుకోవాల్సి రావడం వంటి పరిణామాల వల్లే దేవిశ్రీతో సుకుమార్ బంధానికి బ్రేక్ పడిందని ఇండస్ట్రీ టాక్. ఈ క్రమంలోనే దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో సరికొత్త సంగీతాన్ని అందించేందుకు బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ శాశ్వత్ సచ్‌దేవ్‌తో పాటు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్స్ హర్షవర్ధన్ రామేశ్వర్ లేదా సాయి అభ్యంకర్ ల పేర్లను సుకుమార్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. 2024 హోలీ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించినప్పుడు పోస్టర్‌పై దేవిశ్రీ ప్రసాద్ పేరే ఉన్నప్పటికీ, తాజా మార్పులపై మైత్రీ మూవీ మేకర్స్ లేదా సుకుమార్ టీమ్ నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం సుకుమార్ స్క్రిప్ట్ వర్క్‌ను పక్కాగా సిద్ధం చేసే పనిలో ఉండగా, రామ్ చరణ్ తన ప్రస్తుత చిత్రం 'పెద్ది' పూర్తయిన తర్వాత దసరా సీజన్ ముగిశాక ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే అవకాశం ఉంది, అప్పటివరకు ఈ మ్యూజిక్ డైరెక్టర్ సస్పెన్స్‌కు తెరపడకపోవచ్చు.

# మళ్లీ గ్యాప్ తీసుకుంటే మా ఇంటికొచ్చి కొట్టండి



అక్కినేని కుటుంబం నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయినా, కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అఖిల్ తన కెరీర్, మూడు సంవత్సరాల విరామం, భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు సంవత్సరాలుగా తన నుంచి సినిమా రాకపోవడంతో అభిమానులు నిరాశ చెందారని అఖిల్ అన్నారు. ఇంత పెద్ద గ్యాప్ వచ్చినందుకు ముందుగా అభిమానులందరికీ క్షమాపణలు చెబుతున్నాను. కానీ ఇకపై సినిమాల మధ్య ఇంత విరామం ఉండదు. వరుసగా సినిమాలు చేస్తాను. ఒకవేళ మళ్లీ ఇంత సమయం తీసుకుంటే మా ఇంటికొచ్చి నన్ను కొట్టండి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటున్నాను అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. 'లెనిన్' విడుదలైన వెంటనే ఇప్పటికే విన్న పలు కథల్లో మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయనున్నట్లు వెల్లడించారు. గత చిత్రం ఏజెంట్ తర్వాత ఎందుకు కనిపించలేదన్న ప్రశ్నకు కూడా అఖిల్ సమాధానం ఇచ్చారు.సినిమా విడుదలైన మూడు నెలల తర్వాత ప్రమాదవశాత్తూ బాత్రూమ్‌లో జారి గాజు ముక్కలపై పడటంతో ఎడమ చేతికి తీవ్ర గాయమైందని తెలిపారు. ఆ ప్రమాదం కారణంగా రెండు శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చిందని, మొత్తం 48 కుట్లు పడ్డాయని చెప్పారు. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి దాదాపు 16 నెలలు పట్టిందని, అనంతరం సరైన కథ కోసం కూడా కొంత సమయం కేటాయించాల్సి వచ్చిందని వివరించారు.ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 'లెనిన్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో కూడా అఖిల్ భావోద్వేగంగా మాట్లాడారు. ఈసారి నేను ఎక్కువగా మాట్లాడను. నా సినిమానే మాట్లాడుతుంది. గత కొద్ది రోజులుగా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా, అభిమానుల ప్రేమ, ఉత్సాహం నాకు కొత్త శక్తిని ఇచ్చాయి. ఈసారి నన్ను నమ్మండి అని ఆయన అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న 'లెనిన్'లో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంతో అఖిల్ తన కెరీర్‌లో బలమైన విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.